సాక్షి
కర్నూలు
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



కొబ్బరి కాయలు సమర్పణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబదేవికి ఏప్రిల్ 11న నిర్వహించే కుంభోత్సవ కార్యక్రమంలో స్వాతికబలిగా సమర్పించే కొబ్బరికాయలను శుక్రవారం ఆలయ సిబ్బంది సమర్పించారు.



రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కర్నూలు నగరానికి చెందిన గోరంట్ల శంకర్ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని అందించారు.



మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శుక్రవారం నిత్యకళావేదికపై కొత్తగూడెంకు చెందిన రమాదేవి రామ్, సంతోషిని నాట్య నిలయం వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:50
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:53
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:53
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:47
బనగానపల్లె	సా॥ 6:39	ఉ॥ 4:47

హదీస్ వెలుగు :

చూపు ఎంత మంచిదో అంతకు మించిన ప్రమాదకారి. మనిషి పాపాలకు చూపు మొదటి ఆయుధం. పాపాలు చేయకుండా ఉండేందుకు చూపును నియంత్రణలో ఉంచుకోండి. – పవిత్ర ఖురాన్


ఆ ఇద్దరేనా.. కేసు కంచికేనా!

105 కిలోల వెండి.. రూ.2.50లక్షల నగదు.. సీఐల పర్యవేక్షణలోని బీరువా. ఈ కథలో ఇద్దరు చిరుద్యోగుల మీద వేటు పడటం పక్కన పెడితే.. మరి స్టేషన్ బాధ్యతలు చూస్తున్న అధికారులు ఏమి చేస్తున్నట్లు? ఒక్కరంటే ఏదో పొరపాటు అనుకోవచ్చు. ఏకంగా నలుగురు సీఐలు మారినా రెండేళ్లుగా ఇంత పెద్ద వ్యవహారం ఎలా కన్నుగప్పినట్లు? కిందిస్థాయి ఉద్యోగులు ఇంతటి భారీ చోరీకి పాల్పడితే.. ఇంటి దొంగలను ఎందుకు గుర్తించలేకపోయారు? అసలు ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా ఇద్దరు చిరుద్యోగులు తాము పనిచేస్తున్న పోలీసుస్టేషన్‌కే కన్నం వేయడం సాధ్యమా? లేదంటే వీరిని బలి పెట్టి.. పైస్థాయి ఉద్యోగులను రక్షించే ప్రయత్నం జరుగుతుందా? అసలు దర్యాప్తు సవ్యంగానే సాగిందా? వెండి మాయమైనట్లు గుర్తించిన రెండు రోజులకే మసిపూసి మారేడుకాయ చేసి ఇంతటితో కథ ముగిసింది అనిపించారా? పెద్దల హస్తం లేకపోతే, మిగిలిన వెండి ఏమైనట్లు?



'వెండి మాయం' వెనుక జవాబులేని ప్రశ్నలు

- అసలు స్టేషన్ ఎలా దాటించారు?
- రెండు సంచులను తీసుకెళ్తుంటే ఎవరికీ తెలియదా?
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏమైనట్లు..
- అసలు సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా?
- ఆ సీఐ పట్ల ఎందుకంత ప్రేమ



కర్నూలు: కర్నూలు అర్బన్ తాలూకా పోలీసుస్టేషన్‌లో 105 కిలోల వెండి, రూ.2.50లక్షల నగదు మాయమైన ఘటన పోలీసు శాఖను కుదిపేస్తుంది. కానిస్టేబుల్ రమణబాబు, హెడ్‌కానిస్టేబుల్ అమరావతిలపై చర్యలు తీసుకున్నా.. పూర్తిస్థాయిలో రికవరీ కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అడిషనల్ ఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో ముగ్గురు డీఎస్పీలు, ఇద్దరు ఎస్‌ఐలు శుక్రవారం కూడా అనుమానితులను విచారించారు. కానిస్టేబుల్ రమణబాబు, హెడ్ కానిస్టేబుల్ అమరావతితో పాటు ఆమె భర్త విజయభాస్కర్, మరిది భరత్, స్వీపర్ అయ్యన్నను కర్నూలు శివారులోని ఓ రహస్య ప్రదేశంలో ఉంచి విచారిస్తున్నారు. హెడ్ కానిస్టేబుల్ అమరావతి ప్రస్తుతం కొత్తాళం పీఎస్‌లో విధులు నిర్వహిస్తోంది. కర్నూలులోని ఆమె ఇంట్లో దాచి ఉంచిన 75 తులాల బంగారు నగలతో పాటు రూ.2 లక్షల నగదును భర్త విజయభాస్కర్ బ్యాగులో పెట్టుకుని గురువారం కొత్తాళంకు పారిపోతుండగా దర్యాప్తు పోలీసులు పెద్దపాడు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.

దుకాణం నెం.12 @ మరిది

రెండు సంచుల్లో దాచిన 105 కిలోల వెండి ఆభరణాలను రెండు పర్యాయాలు తానే స్వయంగా మోటార్ సైకిల్‌లో ఇంటికి తీసుకెళ్లినట్లు అమరావతి విచారణలో అంగీకరించింది. ఆ తర్వాత షరాఫ్ బజారులో విక్రయించినట్లు ఒప్పుకుంది. షరాఫ్ బజార్‌లోని 12వ నెంబర్ దుకాణ వ్యాపారి భరత్ ఈమెకు స్వయాన మరిది(భర్త తమ్ముడు). దీంతో అతడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్వీపర్ అయ్యన్న పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు అనుమానించి అతడిని కూడా అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టారు. దీంతో తలకు గాయం కావడంతో అతను ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఘటనపై డీఐజీ ఆగ్రహం

జిల్లాలో సంచలనం రేపిన ఈ ఘటనపై కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్‌తో పాటు రాష్ట్రస్థాయి పోలీసు అధికారులు కూడా ఆరా తీసినట్లు తెలుస్తోంది. పోలీసు శాఖ ప్రతిష్ట మసకబారేలా సిబ్బంది వ్యవహరించడంపై డీఐజీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రాపర్‌గా దర్యాప్తు చేపట్టాలని, ఇందులో అధికారుల పాత్ర ఉంటే కూడా నిర్ధారించాలని ఆదేశించినట్లు తెలిసింది. కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగలు, నగదు స్టేషన్‌లోనే పని చేసే సిబ్బంది తస్కరించడంతో అధికారులు కూడా సీరియస్‌గా భావించి గత మూడు రోజులుగా దర్యాప్తు చేస్తున్నప్పటికీ కొలిక్కి రాకపోవడం గమనార్హం.

మిగిలిన వెండి మాటేమిటి?

వెండి తస్కరించి ఎక్కడ విక్రయించారు, వచ్చిన డబ్బుతో ఏమి కొనుగోలు చేశారు తదితర విషయాలపై ఆరా తీయగా బంగారు నగలతో పాటు రెండు కార్లు కొనుగోలు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అమరావతి అధికారుల ఎదుట అంగీకరించింది. అయితే పూర్తిస్థాయిలో వారి నుంచి రికవరి కాకపోవడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. దీంతో గతంలో పనిచేసిన అధికారుల నుంచి మిగిలిన ప్రాపర్టీని రాబట్టి బాధితులకు అప్పగించాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

ఓ సీఐ పాత్రపై అనుమానం

మాయమైన 105 కిలోల వెండిలో 52 కిలోలు మాత్రమే ఇప్పటి వరకు రికవరీ చేయగలిగారు. అయితే గత రెండేళ్ల కాలంలో ఈ స్టేషన్‌లో పనిచేసిన సీఐల పాత్రపై కూడా స్వయంగా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ విచారించారు. వెండి మాయం విషయంలో ఒక సీఐ పాత్ర ఉన్నట్లు అభిప్రాయానికి వచ్చి ఆయనను ఎస్పీ గట్టిగానే మందలించినట్లు సమాచారం.

సీసీ కెమెరాలు ఏమైనట్లు?

పోలీసు స్టేషన్‌లో ఆ ఇద్దరు పోలీసులతో పాటు ఇంకా చాలా మంది సహోద్యోగులు, ఎస్‌ఐలు, సీఐ పని చేస్తున్నారు? ఈ పోలీసుస్టేషన్ సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంది? స్టేషన్‌లోని ఒక బీరువాను తెరిచి 105 కేజీల వెండి, రూ.2.50లక్షల నగదును ఇద్దరు ఉద్యోగులు ఇంటికి తీసుకెళ్తుంటే.. మిగిలిన ఉద్యోగులు ఏమి చేస్తున్నట్లు?



స్టేషన్‌లోని బీరువాలో దాచిన విలువైన వస్తువులకే భద్రత లేకపోతే ఇక ప్రజల ధనానికి ఈ స్టేషన్ పోలీసులు ఏమాత్రం రక్షణ కల్పిస్తారు? అసలు ఈ స్టేషన్‌లోనే తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఓ సీఐ ప్రమేయం ఉన్నట్లు మొదటి నుంచీ చర్చ జరుగుతున్నా ఎందుకు తెరపైకి ఆయన పేరు రావట్లేదు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు ఆ మూడో కన్నే సమాధానం చెప్పాలి!

న్యూస్‌రీల్

3 నుంచి వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.125.87,63,750 విడుదలయ్యాయి. 4,54,327 పింఛన్‌దారులకు ఈ మొత్తం పంపిణీ చేయనున్నారు. ఏప్రిల్ నెల పింఛన్లను 3వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగియడంతో ఏప్రిల్ 1న బ్యాంకులకు ఆర్‌బీఐ సెలవు ప్రకటించింది. 2న ఆదివారం కావడంతో 3వ తేదీన వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి వైఎస్ఆర్ పెన్షన్ కానుక నిధులను డ్రా చేసి.. ఆ వెంటనే పంపిణీ చేపట్టనున్నారు. 3వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

నేటి నుంచి బీఈడ్ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీఈడ్ కాలేజీల్లో నేటి(శనివారం) నుంచి థర్డ్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10వ తేది వరకు జరుగనున్న పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 2,095 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 616 మంది హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

డీఎడ్ నాల్గో సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు సిటీ: డీఎడ్ 2020–22 బ్యాచ్ నాల్గొవ సెమిస్టర్, గతంలో ఫెయిల్ అయిన 2019–21 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు రాసిన పరీక్షల ఫలితాలు విడుదలయినట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది 12 నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు జరిగాయన్నారు. ఫలితాల కోసం www.bre.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. రీకౌంటింగ్ ఫీజు ఈనెల 15 లోపు చెల్లించాలన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు

గూడూరు: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని డీఈఓ రంగారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన గూడూరు పట్టణంలో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. భయాన్ని వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలను సందర్శించి 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. ఎంఈఓ సునీలమ్మ, హెచ్ఎం సురేష్‌బాబు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ యశోద పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో చలి వేంద్రాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు కోరారు. ఈ మేరకు జిల్లాలోని అందరు ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీల్లో ప్రజల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో చలి వేంద్రాలతో పాటు చలువ పందిళ్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చలివేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిత్యం మట్టికుండలను శుభ్రం చేస్తూ స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలన్నారు. అలాగే నిర్ణీత సమయంలోగా ట్యాంకులను శుభ్రం పరుస్తూ క్లోరినేషన్ చేయించాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లు పాడైతే వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.

ఊరూరా 'ఆసరా' ఆనందోత్సవాలు

- పొదుపు మహిళలకు మెగా చెక్కుల అందజేత



ఆదోనిలో పొదుపు మహిళలకు మెగా చెక్ అందజేస్తున్న దృశ్యం, చిత్రంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు ఊరూరా ఆనందోత్సవాల మధ్య జరుగుతున్నాయి. వైస్సార్ ఆసరా 3వ విడత నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చి నెల 25న విడుదల చేశారు. మార్చి 26 నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆసరా వేడుకలు జరుగుతున్నాయి. శుక్రవారం జిల్లాలోని మూడు మండలాలతో పాటు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరులో సంబరాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గోనెగండ్లలో నిర్వహించిన వేడకల్లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మేయర్ బీవై రామయ్య, డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. సంబరాల్లో దాదాపు 4000 మంది మహిళలు పాల్గొన్నారు. 565 సంఘాలకు రూ.3.48 కోట్ల విలువ చేసే మెగా చెక్‌ను అందజేశారు. కోడుమూరులోని ఎల్ఎల్‌సీ క్యాంపు ఆఫీసు ప్రాంగణంలో ఆసరా సంబరాలు జరిగాయి. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పాల్గొని 824 సంఘాలకు రూ.4.81 కోట్ల విలువ చేసే మెగా చెక్ అందజేశారు. ఈ వేడుకల్లో దాదాపు 3000 మంది మహిళలు పాల్గొన్నారు. ఆలూరు నియోజకవర్గంలోని హాలహర్విలో జరిగిన ఆసరా సంబరాల్లో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణ స్వామి పాల్గొన్నారు. 419 సంఘాలకు రూ.2.70 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 2000 మంది మహిళలు పాల్గొన్నారు. సంబరాల్లో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అర్బన్ ప్రాంతాల్లో...

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో కల్లూరు వార్డులకు సంబంధించి ఆసరా సంబరాలు పెద్ద ఎత్తున జరిగాయి. వేడుకలకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రేణుక హాజరయ్యారు. 256 సంఘాలకు రూ. 1.34 కోట్ల విలువ చేసే మెగా చెక్‌ను అందజేశారు. ఆదోని మున్సిపాలిటీలోని శక్తి గుడి దగ్గర ఏర్పాటు చేసిన సంబరాల్లో దాదాపు 3500 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రూ.9.17 కోట్ల విలువ చేసే మెగా చెక్‌ను సంఘాల లీడర్లకు అందజేశారు. ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీల్లో కూడా ఆసరా సంబరాలు పెద్ద ఎత్తున జరిగాయి.

సీఎం జగన్‌తోనే వాల్మీకులకు న్యాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే వాల్మీకులకు న్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ కర్నూలులో ఏప్రిల్ 2వ తేదీన పెద్ద ఎత్తున ర్యాలీ, బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వాల్మీకులు భారీగా తరలిరావాలని కోరారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో అన్ని ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు టీడీపీలో చేరినా పార్టీకి ఎలాంటి ధోకా లేదని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. టీడీపీలో చేరిన వారు కచ్చితంగా నష్టపోతారన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్ అహమ్మద్, పార్టీ నాయకులు నాగేష్‌నాయుడు, పేట శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీవై రామయ్య, చిత్రంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి


పంటల రుణ పరిమితి ఖరారు

- 2023–24లో పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేస్తూ ఉత్తర్వులు
- మే నుంచి ఖరీఫ్, అక్టోబర్ నుంచి రబీ రుణాలు మంజూరు
- అర్హులైన రైతులకు కిసాన్ క్రెడిట్‌కార్డులు
- క్రెడిట్ కార్డు ఉంటే పూచీ లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం
- సకాలంలో రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ



నంద్యాల: వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో 2023–24 సంవత్సరానికి గాను పంటల వారీగా రుణపరిమితి (స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్) ఖరారు చేస్తూ రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బ్యాంకుల ద్వారా రైతులు పంట రుణాలు పొందవచ్చు. ఏ పంటకు ఎంత రుణం ఇవ్వాలనే విషయమై జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమై నివేదిక రూపొందించింది. ఈ నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపగా అక్కడ నివేదికపై చర్చించి ఆయా పంటలకు రుణ ప్రణాళికను విడుదల చేశారు. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది రుణ పరిమితిని కొంత సడలించి, రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు పెంచుతూ వెసులుబాటు కల్పించారు. ఇస్తూ ఆయా పరిస్థితులకు అనుగుణంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కొన్ని జిల్లాల్లో కూలీల రేట్లు, ఇతర అంశాలు పరిగణలోకి తీసుకొని వెసులుబాటు కల్పించినట్లు బ్యాంకు వర్గాలు తెలిపాయి. ఏడాదికేడాది పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చు పెరుగుతుండటంతో వాటిని పరిగణనలోకి తీసుకున్నారు. పంట రుణ పరిమితిని ఒక ఎకరాకు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకులు ఖరీఫ్, రబీ సీజన్లకు రుణాలు మంజూరు చేస్తాయి. మే నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్‌గా, అక్టోబర్ నుంచి మార్చి వరకు రబీ సీజన్‌గా పరిగణించి రుణ ప్రణాళిక అమలు చేస్తారు. పంట రుణపరిమితి ఆధారంగా ఏడాది కార్యాచరణ రుణ ప్రణాళికను లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో తయారు చేస్తారు. అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్‌కార్డులు మంజూరు చేయాలనే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈ కార్డుల కింద గరిష్టంగా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం అందజేస్తారు. ఇందుకు 7శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లిస్తే వడ్డీలో 3 శాతం రాయితీ బ్యాంకు అందజేస్తుంది. రూ.లక్షలోపు రుణం ఏడాదిలోగా చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం కూడా 4 శాతం వడ్డీ రాయితీ ఇస్తుంది. దీంతో రూ.లక్ష వరకు రుణం తీసుకున్న రైతు సకాలంలో చెల్లిస్తే వడ్డీ భారం నుంచి మినహాయింపు పొందే అవకాశం ఉంది.

అర్హులైన ప్రతి రైతుకు రుణం



జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణాలు అందజేయడమే లక్ష్యంగా రుణ ప్రణాళిక తయారు చేశాం. కిసాన్ క్రెడిట్‌కార్డులకు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. కిసాన్ క్రెడిట్ కార్డు ఉంటే ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు రుణం బ్యాంకులు అందజేస్తాయి. రుణం ఏడాదిలో చెల్లిస్తే వడ్డీ కట్టాల్సిన అవసరం ఉండదు. పంటలకు వెచ్చిస్తున్న పెట్టుబడిని పరిగణలోకి తీసుకొని పంట రుణ పరిమితిని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రతి ఏడాది నిర్ణయిస్తుంది. రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకొని ఇబ్బందులు పడకుండా.. బ్యాంకుల్లో రుణాలు తీసుకొని వడ్డీ రాయితీ పొందాలి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సత్యనారాయణ, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్, నంద్యాల

2023-24లో పంటల వారీగా రుణ పరిమితి (ఎకరాకు)

పంట	రుణపరిమితి (రూపాయల్లో)
వరి(ఖరీఫ్)	38,000-42,000
వరి (రబీ)	42,000-45,000
జొన్నలు(నీటి వసతి)	19,000-21,000
జొన్నలు(వర్షాధారం)	17,000-20,000
మొక్కజొన్న	38,000-42,000
కందులు	18,000-22,000
పత్తి(వర్షాధారం)	40,000-45,000
పత్తి(నీటివసతి)	38,000-42,000
వేరుశనగ(వర్షాధారం)	32,000-35,000
వేరుశనగ(నీటిసవతి)	28,000-32,000
శనగలు	28,000-32,000
పొద్దుతిరుగుడు	19,000-24,000
పచ్చిమిర్చి	68,000-75,000
పండుమిరప	80,000-90,000
పొగాకు	36,000-40,000
టమాట (హైబ్రిడ్)	80,000-90,000
టమాట (ట్రెల్లీస్)	65,000-70,000
అరటి	65,000-80,000
దానిమ్మ	75,000-90,000
బొప్పాయి	72,000-75,000
మామిడి	40,000-45,000
నిమ్మకాయ	22,000-27,000

ఇళ్ల నిర్మాణం పూర్తయితే కొత్త ఊర్లే



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

పత్తికొండటౌన్: ఇళ్ల నిర్మాణం పూర్తయితే జగనన్న కాలనీలు కొత్త గ్రామాలుగా మారతాయని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పత్తికొండ పట్టణ శివారులోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై హౌసింగ్ డీఈ గురుప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి అయితే రోడ్లు వేస్తామన్నారు. అనంతరం చక్రాళ్లరోడ్డులో ఉన్న కస్తూర్బా విద్యాలయం, అంబేడ్కర్ బాలికల గురుకులాలను సందర్శించిన పదో తరగతి విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. కస్తూర్బా విద్యాలయంలో నాడు–నేడు పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామసచివాలయం–6ను తనిఖీ చేశారు.

క్లుప్తంగా

తాటి ముంజలకు వెళ్లి మృత్యు ఒడికి..


మృతి చెందిన బాల లింగమయ్య

రుద్రవరం: జీవనోపాధిలో భాగంగా తాటి ముంజలు కోసేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డాడు. ముత్తలూరుకు చెందిన చిత్తిగాళ్ల బాల లింగమయ్య(38) శుక్రవారం నర్సాపురం సమీపంలోని తాటి వనంలో ముంజలు కోసేందుకు వెళ్లాడు. అక్కడ చెట్టు పైకి చేరుకొని ముంజలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు డేవిడ్, కుమార్తె నిరీక్షణ ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు.

నిడ్జూరులో యువతి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో తెలుగు లలితమ్మ (16) అనే యువతి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో పని చేయాలని తండ్రి చిన్నలాలు మందలించినందుకు క్షణికావేశంలో పడక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టి ఉరి నుంచి తప్పించేసరికి ఆమె మృతిచెందింది. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. క్షణికావేశంతో లలితమ్మ ఉరి వేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మన్మథ విజయ్ తెలిపారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


మృతి చెందిన సుశీలమ్మ

కొలిమిగుండ్ల: ఇటిక్యాల కోళ్ల ఫారం ఎస్సీ కాలనీలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఓ వృద్ధురాలి మృతి చెందింది. కాలనీకి చెందిన సుశీలమ్మ(65) ఇంటి మీదుగా 33/11 కేవీ విద్యుత్ లైన్ వెళ్లింది. తీగలకు పక్కనే మేడిపండు చెట్టు ఉండటం, కొమ్మలు తగులుతున్నాయని శుక్రవారం మధ్యాహ్నం వాటిని తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొలిమిగుండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి


మృతి చెందిన బోనాల రవి

పాములపాడు: కర్నూలు – గుంటూరు రహదారిపై కంబాలపల్లి గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వేంపెంట గ్రామానికి చెందిన బోనాల రవి (36)కి నాలుగేళ్ల క్రితం కర్నూలుకు చెందిన సంధ్యారాణితో వివాహమైంది. కాగా రెండు నెలల క్రితం మనస్పర్థలతో సంధ్యారాణి పుట్టింటికి వెళ్లింది. భార్యను పిలుచుకువస్తానని ఇంట్లో తల్లికి చెప్పి బైక్‌పై కర్నూలుకు బయల్దేరాడు. కాగా కంబాలపల్లి గ్రామం వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న బోర్డును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని 108లో ఆత్మకూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



కర్నూలు నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని మున్వార మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు, మసీదులో చిన్నారుల దువా

సమత..మమత

రంజాన్ నెలలో మొదటి ఏడు రోజులు గడిచిపోయాయి. దీంతో శుక్రవారం ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు సైతం అల్లాహ్ దీవెనలు అందుకునేందుకు కఠిన ఉపవాసాలు ఆచరిస్తున్నారు. పవిత్ర మాసంలో ముస్లింల ఇంట సమత..మమతలు వెల్లివిరుస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


ఉపవాస దీక్షను విరమిస్తున్న దృశ్యం

మాసమంతా పుణ్యమే!

- రంజాన్‌లో దాన ధర్మాలకు ప్రాధాన్యం
- ఒక రూపాయి దానం చేస్తే రూ.70 చేసిన ఫలితం
- నఫిల్ నమాజు చదివితే ఫరజ్ ప్రతిఫలం

కర్నూలు (రాజ్‌విహార్): రంజాన్.. ముస్లింలకు పవిత్ర మాసం. అంతేకాదు పుణ్యాలు సంపాదించుకునే మాసం కూడా ఇదే. ఇస్లామిక్ క్యాలెండర్‌లో షాబాన్ ముగిశాక వచ్చే ఈ నెలకు చాలా ప్రత్యేకత ఉంది. అత్యంత నియమనిష్ఠలతో ఉపవాసాలు, దివ్య ఖురాన్ పఠనం, ఐదు పూటల నమాజ్, తరావీ నమాజ్ చదువుతారు. దీంతో పాటు ప్రతి ముస్లిం తమ సంపాదనలో కొంత భాగం పేదల కోసం వెచ్చిస్తారు. ఎందుకంటే చేసే ఏ సాయానికి అయిన 70 రేట్లు అధిక ఫలం లభిస్తుందని మత పెద్దలు చెబుతారు. దీంతో నెల పొడవునా ముస్లింలు విరివిగా దానధర్మాలు చేస్తుంటారు. మహమ్మద్ ప్రవక్త సాల్లెల్లాహు అలైహి వసాల్లం సూచించిన మార్గాలను అనుసరిస్తే పాప విముక్తులై దేవుడి అనుగ్రహం పొందుతారని మౌల్వీలు చెబుతున్నారు.



- ఫరజ్: అల్లాహ్ సూచించిన, కచ్చితంగా పాటించాల్సిన నిబంధనలను ఫరజ్ అంటారు. వీటిని ముస్లింలు తప్పనిసరిగా ఆచరించాలి. చిన్న పిల్లలు, మానసిక స్థితి సరిగా లేని వారు, అనారోగ్య సమస్యలున్న వారికి మినహాయింపు ఉంటుంది. నమాజ్, రోజా, జకాత్, హజ్ యాత్ర వంటివి ఫరజ్ పరిధిలోకి వస్తాయి. రోజుకు ఐదు పూటల నమాజ్, రంజాన్ జకాత్ పేరుతో దాన ధర్మాలు, హజ్ యాత్ర చేయాలి. సాధారణ రోజుల్లో ఒక ఫరజ్ నమాజ్ చేస్తే 3,35,54,032 నేకియా (మార్కులు) లభిస్తాయి. రంజాన్‌లో 70 రెట్లు అధికంగా ఉంటుందని మత పెద్దలు చెబుతున్నారు.
- సున్నత్: మహమ్మద్ ప్రవక్త (సొ.అ.వ.) దిన చర్యలో పాటించిన నియమాలను సున్నత్ అంటారు. ఇవి ప్రతి ముస్లిం ఆచరించాలి. గుసుల్ (శుద్ధి స్నానం), వజూ చేయటం, మిస్వాక్ వాడడం, ఫరజ్ నమాజులకు ముందు, తరువాత ప్రవక్త చేసిన నమాజ్‌లను సున్నత్ అంటారు. ఇలా ఎన్నో ఉన్నాయి.
- నఫిల్: భక్తి కొలది మనం చేసుకునే ప్రార్థనలను నఫిల్‌గా అంటారు. నమాజ్, రోజా, హజ్‌లో నఫీల్‌ను ఆచరించవచ్చు. తగిన ఫరజ్ పుణ్యం లేని పక్షంలో మరణం తరువాత నఫీల్‌ను పరిగణలోకి తీసుకుంటారు. రంజాన్ మాసంలో ఒక నఫిల్ నమాజ్ చేస్తే ఫరజ్ చదివిన పుణ్యం లభిస్తుంది. అందుకే సమయం దొరికిన ప్రతి సారి నఫీల్ నమాజ్ చదువుతూ ఉండాలి.

ఇది పుణ్యాల నెల



మానవులకు అధికంగా పుణ్యం చేకూర్చేందుకు అల్లాహ్ ప్రసాదించిన నెల రంజాన్. ఈ మాసంలో అధ్యాత్మికతలో గడపాలి. ఫరజ్ నమాజులతో పాటు సున్నత్, నఫీల్, ఖురాన్ తరచూ చదవాలి. నిరుపేదలకు ఫిత్రా, జకాత్‌లు దాన ధర్మాలు చేయాలి.

– హాఫిజ్ మంజూర్ అహ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు

ఆరోగ్యం జాగ్రత్త..

రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తారు. కనీసం నీరు కూడా తీసుకోరు. అయితే షుగర్ వ్యాధిగ్రస్తులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

- ఇఫ్తార్ సమయంలో ఆహార పదార్థాలు, పానీయాలపై నియంత్రణ ఉండాలి. తక్కువ కేలరీలు ఉన్న ఆహార పదార్థాలు, పానీయాలే తీసుకోవాలి.
- ఇన్సూలిన్ ఉత్పత్తిని సరిదిద్దగలిగే షుగర్ మందు మెట్ఫోర్మిన్ వాడుతున్నవారు ఇఫ్తార్ సమయంలో మాత్రల మోతాదులను వైద్యుడి సలహాతో తీసుకోవాలి.
- పాంక్రియాస్ గ్రంధి నుంచి ఇన్సూలిన్ విడుదలకు దోహదపడే గ్లిబెన్క్లమైడ్ మందులు వాడుతున్న వారు వైద్యుడి సలహాతో స్వల్ప వ్యవధికి పని చేసే గ్లిపిజైడ్, రేపగ్లినైడ్ వాడవచ్చు.
- టైప్- 1 డయాబెటీస్ నియంత్రణలో లేనివారు, టైప్-2 డయాబెటీస్ ఉన్నవారు ఉపవాసం ఉండవకపోవడం మంచిది.
- ఇఫ్తార్‌లో తీసుకునే తియ్యటి ఆహార పదార్థాలను తక్కువ మొత్తానికే పరిమితం చేయాలి. అన్నం, చపాతీలు, నాన్ వంటి పిండి పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి.
- ఇఫ్తార్, సహెరీలో పప్పు, పెరుగు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి.
- సహెరీ భోజనం మరీ అర్ధరాత్రి కాకుండా సూర్యోదయానికి ముందు తీసుకోవాలి. ఇది ఉపవాస సమయంలో సమాంతర శక్తి పొందటానికి, రక్తంలో చక్కెర స్థాయి స్థిరంగా ఉంచడానికి ఉపయోగపడుతుంది.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు రిజిస్ట్రేషన్లు: కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని అన్ని నియోజకవర్గాల స్కిల్ హబ్‌లు, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్ కాలేజీలో శిక్షణకు రిజిస్ట్రేషన్‌లు ప్రారంభమైనట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ, పెద్దకడబూరు మండలం మురవణిలోని గరల్స్ డిగ్రీ కాలేజీ, ఆదోని న్యాక్ సెంటర్, కర్నూలు న్యాక్ సెంటర్, ఆలూరు గరల్స్ జూనియర్ కాలేజీ, పత్తికొండ డిగ్రీ కాలేజీ, ఎమ్మిగనూరు గరల్స్ జూనియర్ కాలేజీలలో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే కర్నూలులోని టీటీడీసీ డీఆర్‌డీఏ ట్రెనింగ్ సెంరట్‌ను స్కిల్ కాలేజీగా మార్చినట్లు చెప్పారు. ఆయా సెంటర్లలో డిగ్రీ అర్హత ఐటీ, ఐటీ–ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో ఉద్యోగాలు పొందడానికి అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారన్నారు. అలాగే నిర్మాణ రంగంలో ఎలక్ట్రికల్‌కు 10వ తరగతి, ప్లంబింగ్‌కు 8వ తరగతి అర్హతగా నిర్ణయించామన్నారు. కష్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఇంటర్ అర్హతతో నాన్ రెసిడెన్షియన్ విధానంలో శిక్షణ పొందవచ్చన్నారు. స్కిల్ కాలేజీలో కెమిస్ట్రీ సబ్జెక్ట్ డిగ్రీ అర్హతతో పేషెంట్ రిలేషన్ సర్వీసు డ్యూటీ మేనేజర్‌గా శిక్షణ తీసుకుంటే పరిశ్రమలు, ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌యూ వీసీ ఆనందరావు, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

రిజిస్ట్రేషన్ ఎలా చేసుకోవాలంటే..

- ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో.. లేదా గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లోని డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- ఇతర వివరాలకు 9059290821 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కో ఆర్డినేటర్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబరులో పరీక్షకు సంబంధించిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. కర్నూలులోని సనత్‌నగర్ డిజిటల్ అయాన్ కేంద్రంలో ఆయుర్వేదిక్, హోమియోపతి, యూనానీకి సంబంధించిన మెడికల్ ఆఫీసర్, అలాగే ఆయా విభాగాలకు సంబంధించిన ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ బేస్డ్ పరీక్షలు జరుగుతాయన్నారు. దూపాడులోని కేవీ సుబ్బారెడ్డి ఆయాన్ డిజిటల్‌లో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుకు ఆన్‌లైన్ బేస్డ్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఉదయం 9.30 నుంచి 12 గంటలకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నాగభూషణం

- ప్రధాన కార్యదర్శిగా చక్రపాణి విజయం

కర్నూలు(లీగల్): కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘానికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎంవీ చక్రపాణి విజయం సాధించారు. మొత్తం 903 ఓట్లు ఉండగా 778 ఓట్లు పోల్ అయ్యాయి. అధ్యక్ష పదవికి పోటీ పడిన టి.నాగభూషణం నాయుడు తన ప్రత్యర్థి బి.చంద్రుడిపై 7 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నాగభూషణం నాయుడుకు 391 ఓట్లు రాగా, చంద్రుడుకు 384 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసిన ఎంవీ చక్రపాణి 39 ఓట్లతో సమీప ప్రత్యర్థి డి.నరసింహులుపై విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి పోటీలో ఉన్న ఎస్.షాబుద్దిన్ 68 ఓట్ల తేడాతో నిత్యజీవన్‌రాజుపై గెలుపొందారు. మహిళా ప్రతినిధి స్థానం కోసం పోటీ పడిన సి.జాస్మిన్ తన ప్రత్యర్థి ఎ.అన్నపూర్ణారెడ్డిపై 93 ఓట్లతో గెలుపొందారు. ప్రత్యర్థులుగా పోటీ చేసిన వారు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో కార్యదర్శిగా ఎస్.లక్ష్మణ్, కోశాధికారిగా ఎం.షఫత్, గ్రంథాలయ కార్యదర్శిగా వి.రవికుమార్, క్రీడల కార్యదర్శిగా బి.రాకేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.రాజమోహన్‌రెడ్డి ప్రకటించారు. పోలింగ్‌లో ఎన్నికల అధికారికి న్యాయవాదులు పి.వి.వరప్రసాదరావు, అంజనేయులు, లోకేశ్వరరెడ్డి, రామకృష్ణ సహాయాధికారులుగా వ్యవహరించారు.


జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో గెలుపొందిన న్యాయవాదులు

మార్కెట్ యార్డు ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి

- పారదర్శకంగా కమీషన్ ఏజెంట్ల లైసెన్సుల రెన్యువల్
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను పాణ్యం ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ గౌరవ చైర్మన్ కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మార్కెట్ యార్డులో కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మార్కెట్ కమిటీ సమావేశంలో కాటసాని మాట్లాడారు. 2023–24లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల ద్వారా రూ.6.15 కోట్లు ఆదాయం సాధించే విధంగా మార్కెట్ కమిటీ నిర్ణయించిందని, ఆదాయం పక్కదారి పట్టకుండా సూపర్‌వైజర్లు, అసిస్టెంటు సెక్రటరీలు నిఘా పెంచాలని సూచించారు. 2023 మార్చి 31 నాటికి మార్కెట్ యార్డులోని 175 మంది కమీషన్ ఏజెంట్ల లైసెన్స్ గడువు పూర్తి అయిందని, వీటిని పారదర్శకంగా రెన్యువల్ చేయాలన్నారు. మార్కెట్ యార్డులో రూ.6 కోట్లతో చేపట్టిన జంబోషెడ్ నిర్మాణపు పనులు కాస్త మందగించాయని, పనులను వేగవంతం చేయాలన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో పరిశుభ్రతను పెంపొందించేందుకు నగర పాలకసంస్థ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ యార్డు అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు మార్కెట్‌లో మోసానికి గురి కాకుండా ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎంపిక శ్రేణి సెక్రటరీ గోవిందు, వైస్ చైర్మన్ భీమేశ్వరరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్‌లు కేశవరెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య

డిగ్రీ పరీక్షల్లో 15 మంది డిబార్

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 15 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు మొత్తం 14,024 మంది విద్యార్థుల్లో 12,759 మంది హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు

గంజాయి విక్రేతల అరెస్ట్

- ఇద్దరు అరెస్ట్

డోన్ టౌన్: స్థానిక భారత్ దాబా సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఈడిగ ఈశ్వర్‌గౌడ్, చిగురమానుపేటకు చెందిన ఎరుకల రాములమ్మ ఇతరుల నుంచి గంజాయి కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెచ్ఐవీ బాధితుల కోసం 'మిషన్ వాత్సల్య'

కర్నూలు(హాస్పిటల్): ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్ ద్వారా హెచ్ఐవీతో జీవిస్తున్న చిన్నారులకు గతంలో నెలకు రూ.400 ఐసీడీఎస్ వారు ఇచ్చేవారని, ఇప్పుడు ఆ స్కీమ్‌ను మిషన్ వాత్సల్యగా మార్చి నెలకు రూ.4వేలు ఇస్తున్నామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ పద్మజ చెప్పారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో నేస్తం జిల్లా స్థాయి పాజిటివ్ నెట్‌వర్క్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీతో జీవిస్తున్న పిల్లలకు ఐసీపీఎస్ ఫోస్టర్ కేర్ స్పాన్సర్‌షిప్(మిషన్ వాత్సల్య) ద్వారా లబ్ధిపొందిన పిల్లలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ పద్మజ మాట్లాడుతూ లబ్ధిపొందిన పిల్లలు, వారి తల్లిదండ్రుల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం ద్వారా వచ్చే మొత్తాన్ని వారి ఆరోగ్యం, విద్యకు ఉపయోగించేలా చూడాలని చెప్పారు. జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులు ప్రతి ఒక్కరూ ఏఆర్‌టి మందులు వాడాలని, దీంతో పాటు మంచి పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్. అలి హైదర్ మాట్లాడుతూ ఏఆర్‌టీ మందులు తప్పకుండా వాడుతూ ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహరి, సీడబ్ల్యూసీ మెంబర్లు ఎస్. మురళీకృష్ణ, కె.మధుసుదాకర్, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు బి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌జేడీ పద్మజ

సూక్ష్మ చిత్రం.. రంజాన్ సందేశం


మధుకృష్ణ రూపొందించిన కాబా నమూనా

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన సూక్ష్మ చిత్రకారుడు బండి మధుకృష్ణ సుద్దముక్కతో కాబా, మసీద్ నమూనాలను రూపొందించాడు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు కఠోర ఉపవాసాలను ఆచరిస్తున్నారని మధుకృష్ణ తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముస్లీం సోదరులు సౌదీలో పవిత్రంగా భావించే మక్కా నగరంలోని కాబా, మదీన నగరంలోని మస్జీద్ ఏ నబవి నమూనాలను రూపొందించినట్లు తెలిపారు.

రెక్కల కష్టం బూడిద పాలు

- అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం
- కాలిపోయిన రూ.2 లక్షల నగదు
- రూ.5 లక్షల ఆస్తి నష్టం

హొళగుంద: ఓ పేద రైతు కష్టం బూడిదపాలైంది. అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి ఆ కుటుంబం వీధిన పడింది. హొళగుంద మండలం కోగిలతోట గ్రామంలో శుక్రవారం పైగేరి దేవేంద్రకు చెందిన గుడిసెకు నిప్పంటుకుని ఇంట్లో దాచి ఉంచిన రూ. 2లక్షల నగదు, ఆహార ధాన్యాలు, ఇంటి సామగ్రి కాలిపోయాయి. రూ. 5లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు...పైగేరి దేవేంద్ర తన మూడు ఎకరాలతో పాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఇతని భార్య భూమిక టైలరింగ్ పని చేస్తూ ఇద్దరి కుమారులను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తోంది. పెద్దగా ఆస్తిపరులు కాకపోవడంతో గుడిసెలో నివాసం ఉంటున్నారు. తన చిన్న అన్న ఇంట్లో శుభకార్యం ఉండడంతో శుక్రవారం ఉదయం దేవేంద్ర భార్యాపిల్లలతో సహా వెళ్లాడు. మధ్యాహ్నం ఉన్నట్టుండి గుడిసెకు నిప్పంటుకుని మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి ఆర్పేందుకు ప్రయత్నించారు. విషయం దేవేంద్రకు తెలిసి అక్కడికి చేరుకునే లోపే గుడిసె పూర్తిగా కాలిపోయింది. పెద్ద అన్న వారం రోజు క్రితం బ్యాడిగిలో మిరప అమ్మితే వచ్చిన రూ.2 లక్షల నగదును దేవేంద్రకు ఇచ్చాడు. గుడిసెలో దాచి ఉంచిన ఈ నగదు కాలి బూడిదైంది. అలాగే బియ్యం బస్తాలు, కుట్టుపనికి ఇచ్చిన దస్తులు, ఇంటి సామగ్రి కాలి పోయాయి. ప్రమాదంలో రూ.5 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు తెలిపారు. సర్వం కోల్పోయానని, తనను ప్రభుత్వ అధికారులు ఆదుకోవాలని దేవేంద్ర కోరారు.


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గుడిసె